## క్లుప్తంగా

### సంగీత విద్వాంసులు శాస్త్రి చిరస్మరణీయులు



స్వరార్చనతో సుబ్బరాయశాస్త్రికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

**యానాం:** ప్రముఖ వయోలిన్ సంగీత విద్వాంసులు స్వర్గీయ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి సంగీత సేవలు చిరస్మరణీయమని ప్రముఖ కవి మధునాపంతుల సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం యానాంలో శాస్త్రి గురుస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట సుబ్బరాయశాస్త్రి భారతీయ శాస్త్రీయ వాద్యాలైన వయోలిన్, గాత్రం తదితర వాటిలో అందించిన సేవలు అజరామరమని కొనియాడారు. అనంతరం టివిఎస్ఎస్వి ప్రసాదరావు వ్యాఖ్యానం, వాయిద్య కారుల వాద్య సహకారంతో పంచ రత్నసేవను శ్రావ్యంగా వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖకవి దాట్లదేవదానంరాజు పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామికి లక్షపత్రి పూజ

**తాళ్లరేవు:** పవిత్ర ధనుర్మాసం, వేణుగోపాల స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా కోరంగి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష తులసి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు నేతృత్వంలో ఆలయ అర్చకులు సుదర్శనం గోపాలాచార్యులు బృందం స్వామివారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం లక్ష తులసి దళాలతో పూజించి పువ్వులు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

### వైభవంగా శ్రీనివాస కల్యాణం



ఇందుపల్లి అరవగరువులో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

**అమలాపురం రూరల్:** మండలంలో ఇందుపల్లిలోని అరవగరువులో శ్రీనివాస కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీ బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణాన్ని కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయ వైదికులు వరప్రసాదాచార్యులు నిర్వహించారు. వీరి రామకృష్ణ, ఫణికుమారి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. శ్రీ బాల భక్త గణపతి సేవా సంఘం అధ్యక్షుడు టీకే విశ్వనాథ్ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.


### యోగాశ్రమ శిక్షకుల రక్తదానం



కాకినాడలో రక్తదానం చేస్తున్న అమలాపురం యోగాశ్రమ శిక్షకులు

**అమలాపురం టౌన్:** స్థానిక వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న 13 మంది కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి ఆదివారం వెళ్లి అక్కడి రోగులకు రక్తదానం చేశారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రక్తమందించి మానవత్వాన్ని చాటారు. యోగాశ్రమానికి చెందిన పలువురు శిక్షకులు రక్తదానం చేసినట్లు యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

### కోడి పందేల బరుల తొలగింపు



రాజుపాలెంలో కోడి పందేల బరులను తొలగిస్తున్న పోలీసులు

**ముమ్మిడివరం:** నగర పంచాయతీ శివారు రాజుపాలెం కొబ్బరి తోటలో కోడి పందేల కోసం వేసుకున్న బరులను ముమ్మిడివరం పోలీసులు ఆదివారం తొలగించారు. కోడి పందేల నిర్వాహకులు కొబ్బరి తోటలో నేలను చదును చేసి టెంట్‌లు వేసి బారికేడ్లతో బరులను ఏర్పాటు చేశారు. సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై డి.జ్వాలా సాగర్, పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి బారికేడ్లను తొలగించి బరులను ధ్వంసం చేశారు.

# పండగొచ్చింది.. పల్లెకు రారండోయ్..

- గ్రామాల్లో పండగకు ఏర్పాట్లు
- పట్టణాల నుంచి తరలివస్తున్న పల్లెవాసులు
- ఇళ్ల ముందు ఆకట్టుకుంటున్న రంగవల్లులు



ముమ్మిడివరంలో సంక్రాంతి ముగ్గుల వద్ద యువతుల నృత్యాలు (ఫైల్)



యానాంలో సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

**ముమ్మిడివరం:** భోగి పండగకు పల్లెలు సిద్ధమయ్యాయి. ఏ ఇంట చూసినా రంగురంగుల రంగవల్లులు అతిథులకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా దర్శనమిస్తున్నాయి. సోమవారం పెద్ద ఎత్తున భోగి మంటలు వేసేందుకు యువకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పండగను ఘనంగా జరుపుకునేందుకు ఊరువాడా సిద్ధమైంది. మంటల్లో వేసేందుకు పిడకల దండలను చిన్నారులు సిద్ధం చేశారు. భోగి రోజు సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు వేస్తారు. రేగి పండ్లను పిల్లల తలమీద నుంచి పోస్తారు. చుట్టు ప్రక్కల వారిని, బంధువులను ఆహ్వానించి వాయనాలు ఇవ్వటం హైందవ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. గోదాదేవి నెలరోజుల పాటు ధనుర్మాస పూజలు ఆచరించి భోగినాడు ఫలితం పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఆమె భక్తికి మెచ్చిన మహావిష్ణువు భోగినాడు ఆమెను పరిణయమాడాడు. దేవాలయాల్లో ఏటా ఇదే రోజున శ్రీరంగనాయక స్వామితో గోదాదేవి కల్యాణం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**అల్లవరం:** కొమరగిరిపట్నం జనసేన పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే భోగి మంటలను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. సంబరాల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్ని సంబరాలను విజయవంతం చేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, దాట్ల గోపిరాజు, జనసేన నాయకులు కటికిరెడ్డి బాబి, గుర్రం కృష్ణ, కంకిపాటి వీరబాబు, పిండి గణపయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా సంక్రాంతి సంబరాలు**

**యానాం:** పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వేదస్కూల్‌లో చిన్నారులు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రాలు ధరించిన చిన్నారులు సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం బొమ్మల కొలువు, భోగిమంటలు, గొబ్బెమ్మల నృత్యాలు, గొబ్బెమ్మల పాటలతో ఆనందోత్సాహాల మధ్య ఆనందంగా గడిపారు. అరిసెలు, పొంగడాలు తదితర తిను బండారాలను చిన్నారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తుల జయరామారావు, అర్జున్, నీతూహారి, వీరభద్రరావు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల నిర్వహణ ఏర్పాట్లను వివరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు



బీవీసీలో విద్యార్థినులు తయారు చేసిన పిండి వంటలు

**నేటి నుంచి కోనసీమ సంక్రాంతి సంబరాలు**

**అమలాపురం టౌన్:** సొంతూరు మూలాలకు విలువనిస్తూ, తాను పుట్టిన గడ్డపై సంక్రాంతి సంబరాలను జరిపి ప్రజలకు కనువిందు చేయాలన్న సంకల్పంతో అమలాపురానికి చెందిన హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు కోనసీమ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో గత ఎనిమిదేళ్ల నుంచి కోనసీమ సంక్రాంతి సంబరాలను ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ వెంకటేశ్వరావు సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించే ఈవెంట్ల గురించి వివరించారు. సంక్రాంతి తొలి రోజు భోగి మంటలు, కోలాటాలు, కత్తులు లేని కోడి పందాలు, రెండో రోజు పెద్ద పండుగ రోజున కోనసీమ స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. మూడో రోజు కనుమ పండగ నాడు ప్రభల తీర్థం, గరగ నృత్యాలు, గాలి పటాలు తదితర ఈవెంట్స్‌తో పాటు రాత్రి భారీ ఎత్తున బాణా సంచా కాల్పులు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, అల్లాడ శరత్‌బాబు, సంబరాల పర్యవేక్షకుడు గంధం పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

**బీవీసీలో సంక్రాంతి సంబరాలు**

**అమలాపురం రూరల్:** భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు తెలుగు సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. విద్యార్థినిలు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టారు. డూడూ బసవన్న విన్యాసాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. విద్యార్థినిలకు గాజుల అలంకరణ, గోరింటాకు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పిండి వంటలు చేసి అందరికీ వడ్డించారు. యువత తీన్‌మార్ డబ్బులు, వాయిద్యాలతో ప్రభలను ఊరేగించారు. భోగిమంటలు వేసి సందడి చేశారు. కళాశాల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం వెంకట సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్.మదన్, ఏవో జక్కం కృష్ణారావు, పీడీలు సుధీర్, మరళి, మాధవి పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్:** ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ దివంగత వసంత్ కుమార్ జ్ఞాపకార్థం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ నాయకులు శంకర్, రాం ప్రసాద్ ప్రణీత్ సాయిలు తెలిపారు. వన్నెచింతలపూడి అంబేడ్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## అతిథులొచ్చారు..

**ఐ.పోలవరం/ అమలాపురం రూరల్:** పెద్ద పండగకు అతిథులొచ్చారు. వీరి రాకతో జిల్లాలో పండగ కళ సంతరించుకుంది. సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, మిత్రుల రాకతో సందడి వచ్చింది. పండగ జరిగేది మూడు రోజులే అయినా జిల్లా వాసులకు వారం రోజుల పాటు సందడే సందడి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల నుంచి పెద్ద ఎత్తున స్థానికులు తరలి వచ్చారు. ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లిన వలస పక్షులు సొంత గూటికి చేరుకున్నాయి. హైదరాబాద్ నుంచి శనివారం పెద్ద ఎత్తున జనం బయలు దేరడంతో దారిపొడవునా ట్రాఫిక్ నిలిచి రాత్రికి ఇళ్లకు చేరుకున్నారు. అమలాపురం బస్టాండ్‌లో ఆదివారం ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులలో పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చారు. వీరి రాకతో బస్టాండ్ కిటకిటలాడింది. ప్రైవేట్ బస్సులలో సైతం భారీగానే జనం వస్తున్నారు. మరికొంత మంది సొంత కార్ల మీద రాగా, యువకులు ద్విచక్ర వాహనాల మీద వస్తున్నారు. వీరి రాకతో గ్రామ కూడళ్లలో సందడి నెలకొంది.

# అలరించిన చిన్నారి లాస్యశ్రీ నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి లాస్యశ్రీ

**అమలాపురం టౌన్:** చిన్నారి లాస్యశ్రీ మంగిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకుంది. స్థానిక గంగరాజు ఫంక్షన్ హాలులో చిన్నారి నృత్య రంగ ప్రవేశ ఘట్టం గజ్జె పూజతో ఘనంగా మొదలైంది. అమలాపురానికి చెందిన పద్మప్రియ, వేణుగోపాల్ దంపతుల కుమార్తె లాస్యశ్రీ. ఉద్యోగరీత్యా వేణుగోపాల్ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీశారద నృత్య నికేతన్ వ్యవస్థాపకురాలు, నృత్య కళాకారిణి ములువూరు శైలజ ప్రసాద్ శిష్యురాలైన 13 ఏళ్ల లాస్యశ్రీ తొలిసారి అమలాపురంలో కళాభిమానుల సమక్షంలో నృత్య రంగ ప్రవేశం చేసింది. తన నృత్య భంగిమలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. భామాకలాపం, అన్నమాచార్య కీర్తన, నారాయణ తీర్థ తరంగం, గోవర్ధన గిరిధార, మహేశ్వరి మహాకాళి, థిల్లాన నాగ నృత్య ప్రదర్శనలతో అలరించింది. శైలజా ప్రసాద్ నట్టు వాద్యం, మంథా శ్రీనివాస్ గానం, శ్రీధరాచార్య మృదంగం, అనిల్ వయోలిన్, డాక్టర్ శ్రీకాంత్ తబలా, రమణ ఫ్లూట్, రాయప్రోలు సుధాకర్ వీణ వాయిద్య సహకారాలను అందించారు. చిన్నారి నృత్య పటిమను చూసిన వారంతా ఆనంద భరితులయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి చిన్నారి నృత్య భంగిమలను ఆద్యంతం వీక్షించి అభినందించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీ నారాయణ, మారేపల్లి నరసింహమూర్తి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## 'సంక్రాంతికి వస్తున్నాం' హీరోయిన్ సందడి



అమలాపురంలో సందడి చేస్తున్న సినీ హీరోయిన్ మీనాక్షీ చౌదరి

**అమలాపురం టౌన్:** 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉందని ఆ సినిమాలో నటించిన కథానాయిక మీనాక్షీ చౌదరి అన్నారు. అమలాపురం హైస్కూలు సెంటరుకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ మొబైల్ షాపు ప్రారంభోత్సవానికి ఆదివారం హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో ముచ్చటించారు. గత ఏడాది సంక్రాంతి పండగకు 'గుంటూరు కారం' విడుదలైతే ఈ సంక్రాంతికి అదే పేరుతో 'సంక్రాంతికి వస్తున్నా' సినిమా వస్తుండడం మరింత ఆనందాన్ని ఇస్తోందని పేర్కొన్నారు. సినిమాలో నటించిన విక్టరీ వెంకటేష్ కుటుంబ కథానాయకుడిగా ఇప్పటికే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఇది పూర్తి కుటుంబ కథా చిత్రమని పేర్కొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎంజీజీబీహెచ్ హైస్కూల్ 1987వ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మానస సరోవరం హోటల్‌లో కలుసుకున్న 1985 బ్యాచ్ విద్యార్థులు

**కాట్రేనికోన:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కాకినాడ మానస సరోవరం హోటల్‌లో జరిగింది. పూర్వ విద్యార్థి విత్తనాల ప్రకాశరావు అధ్యక్షతన అలనాటి విద్యార్థులంతా ఓ చోట చేరి సందడి చేశారు. సుమారు 53 ఏళ్ల తరువాత ఒకే చోటకు చేరిన పూర్వ విద్యార్థులు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ధవరపు కల్యాణ చక్రవర్తి, పట్టా సింహాద్రి, మోటుమర్రి సతీష్, బొమ్మిడి యేసుబాబు, కొప్పాడి రాంబాబు, వట్టూరి మురళీకృష్ణ, ఏ. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

**గుర్తుకొచ్చిన అలనాటి జ్ఞాపకాలు**

**యానాం:** విద్యాభ్యాసం అనంతరం వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా 38 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 1987లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆదివారం తాము చదువుకున్న చదువులమ్మ చెట్టు నీడకు చేరుకున్నారు. ఒకొరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు. అనంతరం వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైమానిక దళ మాజీ అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దవులూరి బులివీరాస్వామి, నిసర్గ ఇన్ఫర్మేషన్ అధినేత కన్నన్, వివిధ శాఖల్లో ఉన్నతాధికారులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-1994 బ్యాచ్ విద్యార్థులు



అమలాపురంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

### గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు

**ఉప్పలగుప్తం:** మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–1994 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా ఓ చోట చేరి చదువుకున్న రోజుల్లో అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారికి చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి పాద పూజ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలు, విందు వినోదాలతో సందడి చేశారు.

**అ'పూర్వ' సమ్మేళనం**

**అమలాపురం టౌన్:** స్థానిక కొంకాపలి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2001–2002వ సంవత్సరంలో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాల జాతీయ రహదారి చెంతనే ఉండడంతో పూర్వ విద్యార్థులు రూ.లక్ష విరాళం సేకరించి పాఠశాలకు సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు యిండుగుల ఆనంద్, కరాటం మంగరాజు, గుమ్మళ్ల రవి, రావూరి విజయ్, గాయత్రి, సత్య వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



తాళ్లరేవులో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

**తాళ్లరేవు:** క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని, తద్వారా స్నేహ భావాన్ని పెంపొందించుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం తాళ్లరేవులో ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత నిచ్చి గత 13 ఏళ్లుగా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్న శివన్నారాయణను ఎమ్మెల్యే అభినందించారు. శివన్నారాయణ మాట్లాడుతూ పండగ సందర్భంగా కోడి పందాలు, పేకాట, ఇతర జూద క్రీడల వైపు యువత వెళ్లకుండా ఉండాలనే లక్ష్యంతో ఈ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు అత్తిలి బాబూరావు, వాసంశెట్టి శ్రీనివాస్, విళ్ల వీర, వైదాడి శ్రీనివాస్, ఎలిపే నాగేశ్వరరావు, టి.ఈశ్వరరావు, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జూద క్రీడలకు సర్వం సిద్ధం

- పలు చోట్ల పందాలకు సిద్ధమైన బరులు
- ఇప్పటికే జిల్లాకు చేరుకున్న జూదరులు



మురమళ్లలో పందాలకు ఏర్పాటు చేసిన షామియానాలు, బరులు

**ఐ.పోలవరం:** సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలో పలు చోట్ల మూడు రోజుల పాటు నిర్వహించే కోడి పందాలకు సర్వ సిద్ధమైంది. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ పందెం రాయుళ్లదే పైచేయి అవుతోంది. మురమళ్లలో పెద్ద ఎత్తున భారీ షామియానాలు, కుర్చీలు, బరులు సిద్ధం చేశారు. జి.వేమవరం తదితర గ్రామాల్లో పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. ఇక్కడ గతంలో కంటే ఎక్కువ స్థాయిలో పందాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పందాల కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జూదరులు తమ బంధువుల ఇళ్లకు వచ్చి చేరారు. ఈ సారి కోడి పందాలలో సుమారు 50 కోట్ల వరకు చేతులు మారతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మురమళ్లలో మూడు బరులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాటర్ ప్రూఫ్ టెంట్లు, స్క్రీన్లు ఏర్పాటు చేసేందుకు హైదరాబాదు నుంచి వచ్చి ఏర్పాట్లను చేస్తున్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మజా రాణి

**అమలాపురం రూరల్ :** మండలంలోని ఇందుపల్లి గ్రామంలో ఆదివారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గొడవర్తి సత్యనారాయణమూర్తి నేత్ర వైద్య కేంద్రం పర్యవేక్షణలో శ్రీ బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కంటి విభాగం వైద్యురాలు పద్మజా రాణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

### సంక్రాంతి కిట్లు అందజేత

**అల్లవరం:** ఓడలరేవులో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ యాజమాన్యం ఆ గ్రామానికి చెందిన కుటుంబాలకు సంక్రాంతి పండగ నేపథ్యంలో నిత్యావసరాల కిట్లను ఆదివారం అందజేసింది. ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన ఓడలరేవు సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరై ఓఎన్‌జీసీ సమకూర్చిన కిట్లును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, కొల్లు విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి ఉమా మహేశ్వరరావు, కార్యదర్శి సాయిబాబు, ఓఎన్‌జీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన కవి సమ్మేళనం

**అమలాపురం టౌన్:** సంక్రాంతి సందర్భంగా స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జిల్లా శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. హైందవ సంస్కృతిలో తెలుగువారి అతి పెద్ద పండగ సంక్రాంతి అని కవులు తమ కవితా గానాలతో కీర్తించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కవులు కడలి రామలక్ష్మి, ముత్యాల శరత్‌బాబు, కె.రమణారావు, కుడుపూడి శ్రీలక్ష్మి, కొంకి మహేష్ తదితరలు తమ సంక్రాంతి కవితా గానాలను వినిపించారు. గ్రంథాలయాధికారి వర్మ, గ్రంథాలయ సహాయకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వివేకానందుని జీవితం ఆదర్శం

**ముమ్మిడివరం:** భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని పలువురు వక్తలు పేర్కొన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని పల్లవారిపాలెంలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరవెల్లిపాలెంకు చెందిన సలాది స్వామినాయుడు, బుచ్చిరాజు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేశారు.

**అమలాపురం టౌన్:** స్వామి వివేకానంద జయంతి వేడుకలు అమలాపురంలో అధికారులు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల వివేకానంద విగ్రహానికి తొలుత ఆర్డీవో కె.మాధవి పూల మాలలు వేశారు. అనంతరం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి.రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.